సేంద్రియ ఎరువులకు డిమాండ్

- పోషకాలు ఎక్కువ.. దిగుబడి ఎక్కువ..
- రసాయన ఎరువులతో భూమి నిస్సారం


బైరంపల్లి గ్రామ సమీపంలో పొలంలో వేస్తున్న సేంద్రియ ఎరువు(ఫైల్)

మాగనూర్: పొలాల్లో రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకం పరిమితి మించడంతో రైతులకు ఆర్థిక భారమవుతోంది. రసాయన ఎరువులతో భూములు నిస్సారమవుతున్నాయి. ఈ క్రమంలో రైతుల చూపు సేంద్రియ ఎరువులపై పడింది. దీంతో సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరగడంతో అధిక ధర పలుకుతోంది.

మొక్కకు అవసరమైన పోషకాలు..

సేంద్రియ ఎరవుల్లో మొక్కకు అవసరమైన అనేక పోషకాలు ఉన్నట్లు వ్యవసాయ అధికారి హరిత అంటున్నారు. పశువుల ఎరువులోని గేదె మూత్రం ఓ నత్రజని, పోటాష్, కొద్ది మొత్తంలో భాస్వరం ఉంటాయి. దీన్ని ఎలాంటి రసాయ ఎరువులు ఉపయోగించకుండానే పంటకు వాడవచ్చని వ్యవసాయ శాస్త్రవేతలు స్పష్టం చేస్తున్నారు.

పెరిగిన ధరలు..

రైతుల నుంచి డిమాండ్ పెరడగంతో గతంలో లారీ కోడి ఎరువు రూ.9వేల లోపు ఉండగా, ప్రస్తుతం రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకు ఉంది. పశువుల ఎరువు లారీకి రూ.12 వేల లోపు ఉండగా, ప్రస్తుతం రూ.15 నుంచి రూ. 16 వేలకు పైగా చేరింది. గొర్రెల ఎరువు సైతం గతంలో రూ.7 వేల లోపు ఉండగా, ప్రస్తుతం రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు ఉంది. సీజన్ దగ్గరకు వచ్చే కొద్ది మరింత ధరలు పెరిగే అవకాశం ఉంది.

సేంద్రియ పంటలే మేలు..



నేటి రోజుల్లో సేంద్రియ వ్యవసాయాన్ని రైతులు మరిచిపోతున్నారు. రసాయనిక ఎరువులు వాడడంతో ఖర్చులు పెరుగుతున్నాయి. రసాయనిక మందుల పిచికారీ చేయడంతో పంటలో ఉన్న పోషక విలువలు తగ్గుతున్నాయి. సేంద్రియ పంటలను తింటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు.

– మారెప్ప రైతు అచ్చంపేట

దిగుబడి పెరుగుతుంది..



రైతులు రసాయానికి ఎరువులు కాకుండా సేంద్రియ ఎరువుల ద్వారా పంటలు పండిస్తే ఎంతో లాభం ఉంటుంది. సేంద్రియ ఎరువు భూమిలో చల్లడం ద్వారా పంట అధిక దిగుబడి రావడమే కా కుండా పెట్టుబడి ఖర్చులు బాగా తగ్గుతాయి.

– కట్టమీది ఆంజనేయులు, రైతు మాగనూర్

రసాయనాల వాడకం తగ్గించాలి



ప్రస్తుత కాలంలో రైతులు పూర్తిగా రసాయన ఎరువుల వాడకం వైపే మొగ్గు చూపుతున్నారు. అయితే అలా కాకుండా రసాయన ఎరువులను తగ్గిస్తు సేంద్రియ ఎరువులను వాడాలి. అప్పుడే అధికదిగుబడితో పాటు మంచి పంట వస్తుంది.

– సుదర్శన్‌గౌడ్, ఇన్‌చార్జి ఏఓ, మాగనూర్

కేంద్రం కులగణన సర్వేతో బీసీల లెక్క తేల్చాలి


మాట్లాడుతున్న బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండు యాదవ్

మరికల్: కేంద్ర ప్రభుత్వం నిర్వహించే కులగణన సర్వే ద్వారా బీసీల లెక్క తేల్చాలని బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు పాండుయాదవ్ అన్నారు. మరికల్‌లో ఆదివారం నిర్వహించిన బీసీ ముఖ్య నాయకుల సమవేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన కుల గణన సర్వేలో బీసీ జనాభా లెక్కలను తారుమారు చేపి 64 శాతం పైగా ఉన్న బీసీలను తగ్గించి చూపించే ప్రయత్నం చేసిందన్నారు. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వం బీసీల కులగణన చేసి లెక్క తెలుస్తామని ప్రకటించినట్లు తెలిపారు. 64 శాతానికి పైగా బీసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంపీ, ఎమ్మెల్యేల రిజర్వేషన్ స్థానాలను రిజర్వు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సంధ్యారాణి, వినోద్‌కుమార్, మహేంద్ర నరసింహయాదవ్, రాజు, లింగప్ప, వెంకటప్ప, నరేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్

నారాయణపేట: బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మద్దూర్ వెంకటేశ్ యాదవ్‌ను నియమిస్తూ ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షులు బూర్గుపల్లి పల్లి క్రిష్ణ యాదవ్‌లు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో సైతం బీసీలు కైవసం చేసుకునేలా కృషి చేస్తామన్నారు.

సూచిక బోర్డులు కరువాయే!


చిన్నవాగు సమీపంలో ప్రమాదకర మూలమలుపు

మాగనూర్: గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు కేటాయిస్తోంది. కానీ ప్రమాదకర మూలమలుపులను మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు వాహనదారులు వాపోతున్నారు. మండలంలోని మాగనూర్–వర్కూర్ గ్రామాల మధ్య మాగనూర్ చిన్న వాగు సమీపంలో ఓ మూలమలుపు వద్ద అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్న పంచాయతీ రాజ్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో రవాణా సౌకర్యాన్ని మెరుగు పర్చేందుకు బీటీ రోడ్లను నిర్మిస్తోంది. కానీ రోడ్లపై మూలమలుపులు ప్రమాదకరంగా మారినా పట్టించుకోవడం లేదు. మలుపుల వద్ద హెచ్చరించక బోర్డులను అధికారులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా, నిర్లక్ష్యం వహిస్తున్నారు. కొన్ని చోట్ల రోడ్డు మలుపు వద్ద ఇసుక ఉండటంతో వాహనం అదుపు తప్పి కింద పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు.

రోడ్డు నిబంధనలు పట్టవా?


మండల కేంద్రం సమీపంలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటో

మాగనూర్: రోడ్డు నిబంధనలు తప్పనిసరి అంటూ అధికారులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా కొందరు పట్టించుకోవడం లేదు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ముఖ్యంగా పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేని కారణంగా ఆటోలు, జీపులో ఎక్కువ మందిని తరలిస్తూ నిబంధనలు పట్టించుకోవడం లేదు. ఒక ఆటోలో నిబంధనల ప్రకారం 6 మంది ప్రయాణించాల్సి ఉంటుంది. కానీ ఒకే ఆటోలో 15 నుంచి 20 మందిని తరలిస్తున్నారు. దీంతో అనుకోని ప్రమాదం జరిగితే భారీ ప్రాణనష్టం జరగడం కాయంగా కనిపిస్తుంది. అధికారులు స్పందించి ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధిక లోడు.. అడిగేదెవరు?


మండల కేంద్రం మీదుగా వెళ్తున్న భారీ లోడ్ బూడిద టిప్పర్

మాగనూర్: మండలంలో నిబంధనలు మీరి రోడ్ల పైకొస్తున్న భారీ బూడిద వాహనాలు స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. బూడిద టిప్పర్లతో ప్రమాదాలు సంభవిస్తున్నా అడిగే నాథుడే కరువయ్యారు. కర్ణాటక రాష్ట్రం శక్తినగర్‌లోని కేటీపీఎస్ నుంచి నిత్యం మండల కేంద్రం మీదుగా ఈ వాహనాలు ప్రయాణిస్తున్నాయి. అయితే నిబంధనలకు విరుద్ధంగా బూడిద లోడ్‌తో టిప్పర్లు వస్తుండటంతో పాటు కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో వెనుక వచ్చే వాహనాదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతూ.. ప్రమాదాలకు గురై ప్రాణాలు సైతం కోల్పోతున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఇంతలా జరుగుతున్న సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అటువంటి వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

దత్తలింగేశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు



మరికల్: మండల కేంద్రంలోని దత్తనగర్‌లో నిర్మించిన నూతన ఆలయంలో ఆదివారం ఘనంగా దత్త లింగేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ప్రత్యేక పూజల అనంతరం మూడో రోజు దత్త లింగేశ్వర స్వామి, కాలభైరవుడు, అభయాంజనేయస్వామి, నవగ్రహాలు, నాగదేవతల విగ్రహాలతో పాటు ధ్వజ స్తంభం విగ్రహ ప్రతిష్ఠించారు. తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ధన్వాడ: కోయిల్‌సాగర్ వాగులో నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని గోటూర్ శివారులోని కోయిల్‌సాగర్ వాగులో నుంచి రహస్యంగా శనివారం అర్ధరాత్రి సమయంలో ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అధికారుల అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

పడకేసిన పారిశుద్ధ్యం



కొత్తపల్లి: పంచాయతీలలో నిధులు లేక పరిపాలనా ఇబ్బందులు కొనసాగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లపైనే పారుతున్న మురుగు, ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఎక్కామేడ్ గ్రామ పంచాయతీలో హనుమాన్ దేవాలయం నుంచి ప్రాథమిక పాఠశాల వరకు రోడ్డు మీదనే మురుగు పారుతుండటంతో నడవటానికి కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగు నిల్వతో దోమల బారిన పడి అనారోగ్యాల పాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అధ్వానంగా బైరంపల్లి రోడ్డు



మాగనూర్: మండలంలోని ఉజ్జెల్లి నుంచి బైరంపల్లి వరకు ఉన్న మట్టి రోడ్డు గుంతలు, కంప చెట్లతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దాదాపుగా మూడు కిలోమీటర్ల రోడ్డు గుంతల మాయంగా మారింది. నేరడగం సమీపం నుంచి తాత్కాలిక రోడ్డు నిర్మించిన పెద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత ఆధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి


సాగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ధన్వాడ: మండలంలోని కంసాన్‌పల్లి గ్రామంలో సాగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ చిత్రపటానికి పూజలు చేశా రు. కార్యక్రమంలో సాగర సంఘం మండల అధ్యక్షులు నర్సింహులు, నారాయణ, లక్ష్మయ్య, రాజు, శివరాజ్, రమేష్, చంద్రశేఖర్, రామచంద్రయ్య, అనిల్, ఆనంద్, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు


మరికల్‌లో చిన్నారుల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న ఎంపీ డీకే అరుణ

నర్వ: మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ జన్మదిన వేడుకలను బీజేపీ మండల అధ్యక్షులు అజిత్ సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నర్వలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రానికి కార్యకర్తలంతా వెళ్లి రక్తదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, యాదవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, చంద్రకాంత్, ఆంజనేయులు, పరుశురాం, వెంకటేష్, హన్మంతురెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

04ఎంకేఎల్401: నర్వలో బీజేపీ ఎంపీ డీకే అరుణ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మండల నాయకులు

మరికల్: మండల కేంద్రంలో ఎంపీ డీకే అరుణ జన్మదిన వేడుకలు బీజేపీ నాయకులు, అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మరికల్‌లో పెట్రోల్ బంకు ప్రారంభోత్సవానికి హాజరైన ఆమెకు ఘన స్వాగతం పలికారు. అక్కడే చిన్నారుల మధ్య కేక్‌కట్ చేయించి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు వేణు, భాస్కర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, రమేష్, రాజేష్, వెంకటేష్, శెట్టి మహేశ్, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్వర్ణోత్సవ వేడుకలు


ఆలయ ఆవరణలో పూజలు నిర్వహిస్తున్న పండితులు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ శ్రీ భూ శ్రీనివాసస్వామి ఆలయంలో జరుగుతున్న స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. వారం రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించగా చివరిరోజు ఆదివారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం భగవత సప్తాహం, సంగీత కచేరి, ఆధ్యాత్మిక ధార్మిక ప్రసంగాలు కొనసాగాయి. ఈ సందర్భంగా బిద్వాన్ తుప్పనక్కిరి ప్రహల్లాదచార్యులు మాట్లాడారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఆధ్యాత్మిక చింతన తప్పనిసరి అన్నారు. భక్తి భావంతోనే మోక్షానికి మార్గం సిద్ధిస్తుందన్నారు. శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతాన్ని వివరించారు. హంపీ క్షేత్ర పీఠాధిపతులు గోవింద తీర్థుల స్వామి అవబృత సంక్షోప్రాణం చేశారు. కార్యక్రమంలో శక్తి పీఠం వ్యవస్థాపకులు శాంతానంద్ పురోహిత్, సేవా సమితి సభ్యులు సీతారామారావు, జనార్దన్‌రావు, ప్రభంజన్ రావు, భీమ్‌సేన్ చారి, హన్మేష్, ప్రకాష్ శేషు పాల్గొన్నారు.

భక్తుల ఇలవేల్పు లోకిరేవు వీరభద్రుడు


ఉత్సవాలకు ముస్తాబైన లోకిరేవు వీరభద్రస్వామి దేవాలయం


భద్రకాళి సమేత వీరభద్రస్వామి మూలవిరాట్

- రేపటి నుంచి వీరభద్రస్వామి ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు

నవాబుపేట: మండలంలోని లేకిరేవులో ఏకశిలతో స్వయంభూగా వెలసి.. ఇక్కడి ప్రజల ఇంటి దేవుడిగా వెలుగొందుతున్న భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏకశిలతో నిలువెత్తు రూపం లోకిరేవు వీరభద్రుడి ప్రత్యేకత. ఎక్కడ అయినా వీరభద్రుడి విగ్రహం చిన్నగా ఉంటుంది. కానీ లోకిరేవులోని పురాతన దేవాలయంలో మాత్రం ఐదున్నర అడుగుల నిలువెత్తు విగ్రహం ఏకశిలతో ఉండటం.. వీరభద్రుడి తలపై శివలింగం ఉండటం ఇక్కడి విశేషం. కొని దశాబ్దాల క్రితం లోకిరేవు వాగు ఒడ్డుపై వెలసిన స్వామివారు భక్తులతో నిత్య పూజలు అందుకుంటున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు తమ ఇలవేల్పుగా భావిస్తారు. ప్రతి ఏడాది మే నెలలో స్వామివారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం, శకటోత్సవం, అగ్నిగుండ మహోత్సవాలు పెద్దఎత్తున నిర్వహిస్తారు. కాగా, అగ్నిగుండ మహోత్సవంలో చాలా మంది శివ భక్తులు అగ్నిలో నడిచి మొక్కులు తీర్చుకుంటారు.

కార్యక్రమాలు ఇలా..

లోకిరేవు వీరభద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 6న నందికోళ్ల సేవ, 7వ తేదీ తెల్లవారు జామున అగ్నిగుండ మహోత్సవం, సాయంత్రం శకటోత్సవం, పార్వతీ పరమేశ్వరుడి కల్యాణ్యం నిర్వహించనున్నట్లు పూజారులు లింగయ్య, నందీశ్వర్ తెలిపారు. 8న ప్రత్యేక అలంకరణ, 9న మహా మంగళహారతితో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. కాగా, ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఘనంగా శేషదాసుల ఆరాధనోత్సవాలు


ధన్వంతరి హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శేషదాసుల 140వ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకం, ధన్వంతరి హోమం నిర్వహించారు. అనంతరం వేదపండితులు రమేషాచారి, ప్రసన్నచారి భక్తులకు ప్రవచనాలు వినిపించారు. భజన మండలి సభ్యులు ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. మల్దకల్ గ్రామానికి చెందిన దాత దామ శంకరయ్య, దామ పార్వతమ్మ రూ.5 లక్షల వ్యయంతో తయారు చేసిన రథాన్ని వితరణ చేశారు. దాతలను ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ధీరేంద్రదాస్ సన్మానించారు. కార్యక్రమంలో శశాంక, విష్ణు, అరవిందరావు, ముకుందరావు, మదన్‌మోహన్, వెంకటేశ్వరావు, భీమ్‌సేనాచారి, శ్రీకాంత్ జోషి, రవిచారి, మధసూదనాచారి, దామ మురళి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు ఘన సన్మానం



మరికల్: పది ఫలితాల్లో మండల టాపర్‌గా వచ్చిన విద్యార్థులను ఆదివారం ఎంఈఓ మనోరంజిని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెట్టుకున్న ఆశయాలను వమ్ము చేయకుండా భవిష్యత్‌లో కష్టపడి, ఇష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లశర్మ, వినితమ్మ, రఘు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఊట్కూరు: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం 1986–87 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులు చౌదరి సుభాష్, లక్ష్మన్నలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చంద్రకంటి శ్రీనివాస్, వెంకట్రావు, సుజాత, సుధాకర్‌రెడ్డి, సురేష్‌రావు, దత్తురావు, డబ్బ శంకర్ పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలో 1998–99లో పదో తరగతి పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం విద్య నేరిప్న ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాభిశిల ప్రతిష్ఠాపనోత్సవాలు




దామరగిద్ద: మండలంలోని ఉడ్మల్‌గిద్దలో ఆదివారం బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నాల్గు ప్రధాన కూడళ్ల బొడ్రాలకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. గ్రామ ఆడపడుచులు పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించారు. గ్రామ చెక్కభజన మండలి జానపద ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువతీ యువకులు, ఆడపడుచులు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా వేసవి శిబిరం ప్రారంభం



నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు యంగ్ ఇండియా వేసవి శిబిరం ప్రారంభించినట్లు పాఠశాల హెచ్‌ఎం భారతి తెలిపారు. ఈ వేసవి శిబిరం ప్రారంభోత్సవానికి సీఎంఓ రాజేంద్ర కుమార్, మండల విద్యాశాఖ అధికారి బాలాజీ హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమలో ఉన్న ప్రతిభా నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడానికి సువర్ణ అవకాశమని తెలిపారు. వేసవి శిబిరాన్ని తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వహణ జిల్లా ఇన్‌చార్జి యాదయ్య శెట్టి, పాఠశాల ఉపాధ్యాయులు మధుసూదన్ రావు, శ్రీదేవి, శశిరేఖ నరసింహ, వెంకటేష్ పాల్గొన్నారు.



దామరగిద్ద: ప్రభుత్వం విద్యార్థుల్లో వివిధ అంశాల్లో సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన యువ భారత్ వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కృష్ణారెడ్డి, ఎస్ఆర్‌పి కాశప్ప తెలిపారు. ఆదివారం మండలంలోని మొగుల్‌మడ్క జెడ్పీ ఉన్నత పాఠశాలలో యంగ్ ఇండియా వేసవి శిక్షణ శిబిరాన్ని వారు ప్రారంభించారు. వేసవి శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నవ్యశ్రీ, ప్రకాష్, వెంకటనాయక్, అంజిలప్ప మాజీ సర్పంచ్ మహిపాల్, ఉపాధ్యాయులు పాఠశాల ఆదర్శ కమిటీ చైర్మన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.